Follow: @ANNTELUGU
REGISTERED NUMBER APTEL/2014/58382
12-02-2026
# మహా పత్రిక
ANN తెలుగు
తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 45 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD గురువారం WWW.EPAPER.MAHAADAILY.COM



## దేశాన్ని అమ్మేశారు

**భారత్‌ను పణంగా పెట్టడానికి సిగ్గులేదా?**

**అమెరికాతో ట్రేడ్ డీల్‌పై రాహుల్ గాంధీ ఫైర్**

**లోక్ సభలో ప్రతిపక్ష నేత నిప్పులు**


**ఢిల్లీ, మహా :** అమెరికాతో వాణిజ్య ఒప్పందం, కేంద్ర బడ్జెట్‌పై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. అమెరికాతో ట్రేడ్ డీల్‌తో 140 కోట్ల ప్రజానీకం భవిష్యత్తును పణంగా పెట్టారని ఆరోపించారు. ఇది సిగ్గు చేటని, దేశాన్ని అమ్మేశారని అన్నారు. 'మనం చమురు ఎక్కడ నుంచి కొంటామో అమెరికా నిర్ణయిస్తుందా? ఏ ప్రధానమంత్రి కూడా ఇలా చేయలేదు. ట్రేడ్ డీల్ పేరుతో మీరు పూర్తిగా లొంగిపోయారు' అని విరుచుకుపడ్డారు. లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై జరుగుతున్న చర్చల్లో రాహుల్ గాంధీ కీలక ప్రసంగం చేశారు.

మిగతా 2లో

టాప్ న్యూస్

### కాంగ్రెస్ ప్రభంజనం ఖాయం

- 90 శాతం స్థానాలు గెలుస్తాం
- పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ధీమా



02

### నటుడిని మించి పోయావ్

- దువ్వాడకు జగన్ క్లాస్



02

### తమన్నానే రైట్

- మైసూర్ శాండల్ సోప్‌కు
- బ్రాండ్ అంబాసిడర్‌గా నియామకం
- వివాదంపై కర్నాటక మంత్రి క్లారిటీ



02

## నేడు భారత్ బంద్

**రవాణా, బ్యాంకింగ్ సర్వీసులకు అంతరాయం**



**ఢిల్లీ, మహా :** దేశవ్యాప్తంగా ఈనెల 12న సార్వత్రిక సమ్మె జరుగనుంది. సమ్మెకు 10 ప్రధాన కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. పలు రైతు సంస్థలు మద్దతు ప్రకటించాయి. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కార్మిక సంఘాలు ఈ పోరాటానికి పిలుపునిచ్చాయి. ప్రస్తుతం ఉన్న 29 కార్మిక చట్టాల స్థానే 2025 నవంబర్‌లో

మిగతా 2లో

## జీహెచ్ఎంసీ విభజనను వ్యతిరేకిస్తున్నాం

**ఇది చట్ట వ్యతిరేకం**

**కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**



**హైదరాబాద్, మహా :** మజ్లిస్ పార్టీ ఒత్తిడి, కాంగ్రెస్‌పార్టీ తమ రాజకీయ ప్రయోజనాల కోసం రాజేంద్రనగర్, మహేశ్వరం వంటి ప్రాంతాల్లోని మజ్లిస్ ఆధిపత్యం కలిగిన ప్రాంతాలను కోర్ జీహెచ్ఎంసీలో చేర్చారని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆరోపించారు. ఇప్పటికే కనీస సౌకర్యాలు కల్పించలేకపోతున్న పరిస్థితిలో ఇది మరింత భారమవుతుందన్నారు.

మిగతా 2లో

## ఎంపీ అర్వింద్, జగ్గారెడ్డి, గంగులపై కేసుల నమోదు

**ఎన్నికల సందర్భంగా గీత దాటిన నేతలు**



**మహా నెట్ వర్క్:** ఎన్నికల సందర్భంగా నోరు అదుపుతప్పిన నేతలపై పోలీసులు కేసులు నమోదుచేశారు. నిజామాబాద్‌లో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ 34వ డివిజన్ పోలింగ్ కేంద్రంలో పోలీసులు, ఎన్నికల సిబ్బందిపై అర్వింద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

మిగతా 2లో



## డాక్టర్ శ్రీలీల

**ఎంబీబీఎస్ పట్టా అందుకున్న అందాల నటి**

వివరాలు 2లో

# హస్తం హవా

## పట్టణమూ కాంగ్రెస్ వైపే..

**తేల్చిచెబుతున్న ఎగ్జిట్ పోల్స్.. భారీగా పోలింగ్.. రేపే కౌంటింగ్**

**85 శాతం స్థానాల్లో కాంగ్రెస్ జయభేరి మోగిస్తుందన్న అంచనాలు**

**కార్పోరేషన్లలో ఐదు వన్ సైడ్.. నిజామాబాద్, కరీంనగర్ లో తీవ్రపోటీ**

**ఆదిలాబాద్, నిజామాబాద్ మునిసిపాలిటీల్లో బీజేపీకి షాక్**

**పలు మునిసిపాలిటీలలో కాంగ్రెస్ కు గట్టిపోటీనిచ్చిన బీఆర్ఎస్**



**హైదరాబాద్, మహా:** మునిసిపోల్స్ ఎన్నికల్లో భారీగా 73 శాతం పోలింగ్ నమోదవగా, పట్టణ ఓటర్లు కాంగ్రెస్ కే జై కొట్టినట్లు ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి. 85 నుండి 90 వాతం ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్ కు అనుకూలంగా ఉన్నట్లు చెబుతున్నాయి. నిజామాబాద్, కరీంనగర్ కార్పోరేషన్లలో హంగ్ వాతావరణం ఉండగా, మిగతా ఐదు కార్పోరేషన్లలో వార్ వన్ సైడ్ అన్నట్లుగా కాంగ్రెస్ పరిస్థితి ఉన్నదని ఎగ్జిట్ పోల్స్ లో తేల్చారు.

## పురపోరులో కాంగ్రెస్ హవా

తెలంగాణలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ దాదాపు 70 శాతం మున్సిపాలిటీలను, కార్పొరేషన్లను కైవసం చేసుకోనున్నట్లు పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వేలో వెల్లడయింది. మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబూబ్ నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ జోరు కనిపిస్తున్నట్లు తెలిపింది. కరీంనగర్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను బీజేపీ కైవసం చేసుకునే అవకాశాలు ఉన్నాయని, ఈ రెండు మున్సిపల్ కార్పొరేషన్లలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించనుందని పేర్కొన్నది. అయితే, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఎంఐఎం కింగ్ మేకర్ కావచ్చని తెలిపింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ ఏ ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ గెలిచే అవకాశాలు లేవని స్పష్టం చేసింది. పీపుల్స్ పల్స్ తో పాటు పలు సంస్థలు సర్వేలు చేశాయి. కాంగ్రెస్ 100కు పైగా మునిసిపాలిటీలు గెలిచే అవకాశముందని పలు సర్వేలు తేల్చాయి. బీజేపీ ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో ఎదురుగాలి వీచిందని కాంగ్రెస్ విజయాన్ని ఎగ్జిట్ పోల్ ట్రెండ్స్ తేల్చాయి. బీఆర్ఎస్ పార్టీ పుంజుకోగా, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో కాంగ్రెస్ కూడా పుంజుకుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లా (17)లో అన్ని మునిసిపాలిటీలు స్వీప్ చేయనుందని, ఉమ్మడి ఖమ్మం జిల్లా(7)లో మునిసిపాలిటీలన్నీ కాంగ్రెస్ ఖాతాలోకే వెళ్తాయని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా(10)లో కాంగ్రెస్7, బీఆర్ఎస్2, ఎంఐఎం1 సాధిస్తాయని, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా(7)లో కాంగ్రెస్ 6, బీఆర్ఎస్ 1, ఉమ్మడి కరీంనగర్ లో కాంగ్రెస్ 10, బీఆర్ఎస్ 2, బీజేపీ 1 మునిసిపాలిటీలు గెలుస్తారని పలు మీడియాసంస్థలు ప్రకటించాయి. పోలింగ్ సరళిపై కాంగ్రెస్ హ్యాపీగా ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేష్‌గౌడ్, మంత్రులు పోలింగ్ తీరుపై సంతోషంగా ఉన్నారు.

మిగతా 2లో

# మహా విభజన

**మూడు కార్పొరేషన్లుగా జీహెచ్ఎంసీ.. కొత్త అధ్యాయానికి అంకురం**

**మూడు కార్పొరేషన్లకు ప్రత్యేక అధికారిగా జయేష్ రంజన్**

**సైబరాబాద్ కమిషనర్ గా శ్రీజన, మల్కాజ్ గిరి కమిషనర్ గా వినయ్ క్రిష్ణారెడ్డి బాధ్యతల స్వీకరణ**



**హైదరాబాద్, మహా :** గ్రేటర్ హైదరాబాద్ పరిపాలనలో బుధవారం ఒక చారిత్రక మార్పు చోటు చేసుకుంది. ఇప్పటివరకు జిహెచ్ఎంసి పరిధిలో ఉన్న ప్రాంతాలను రాష్ట్ర ప్రభుత్వం 3 కార్పొరేషన్లుగా విభజించింది. గతంలో ఉన్న 150 డివిజన్లు పునర్విభజన అనంతరం 243 స్థానాలకు పెరిగాయి. శివారు మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల విలీనంతో మరో 57 డివిజన్లు అదనంగా చేరాయి. ఇలా మొత్తం 300 డివిజన్లతో విస్తరించిన మహా నగరాన్ని పరిపాలన సౌలభ్యం కోసం, అధికార వికేంద్రీకరణ లక్ష్యంతో ప్రభుత్వం మూడు కార్పొరేషన్లు జీహెచ్ఎంసీ, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ)లుగా విడగొట్టింది.

మిగతా 2లో

## తెలంగాణకు కేంద్రం గుడ్ న్యూస్

**రూ.1000 కోట్లతో రైల్వే ప్రాజెక్ట్**

**వరంగల్, మహా:** తెలంగాణకు రైల్వే శాఖ గుడ్‌న్యూస్ చెప్పింది. రాష్ట్రంలో మెగా ఫైట్ ఎగ్జామినేషన్ స్టేషన్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఈ ప్రాజెక్టును రూ.1000 కోట్లతో ఏర్పాటు చేయనున్నట్లు రైల్వే శాఖ వెల్లడించింది. తెలంగాణలో రైల్వే వ్యవస్థను మరింత బలోపేతం చేసే ప్రయత్నంలో భాగంగా వరంగల్ జిల్లాలో గూడ్స్ రైలు వ్యాగన్ల రిపేర్ కోసం ఒక మెగా ఫ్రైట్ ఓవర్ హాలింగ్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇది తెలంగాణ రాష్ట్రంలోనే మొట్టమొదటిది కావడం విశేషం.



మిగతా 2లో



## ఆదిలాబాద్ మునిసిపాలిటీ కైవసం చేసుకుంటాం

**ప్రజాదీవెన కాంగ్రెస్ వైపే.. కంది శ్రీనివాస రెడ్డి**

**ఆదిలాబాద్, మహా :** ఆదిలాబాద్ మున్సిపల్ పీఠం పై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు.బుధవారం మున్సిపల్ ఎన్నికల నేపధ్యంలో ఆయన పట్టణంలోని పలు పోలింగ్ స్టేషన్ లను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు.బల్దియా లో కాంగ్రెస్ హవా చూస్తుంటే మొత్తం 49 లో అత్యధిక స్థానాలు గెలుచుకుంటామన్న ధీమా వ్యక్తం చేసారు. ప్రజాదీవెన కాంగ్రెస్ కే ఉందని, మెజారిటీ స్థానాలు కైవసం చేసుకుని ప్రజలకు మెరుగైన పరిపాలన అందిస్తామన్నారు.



## వందేమాతరంపై కేంద్రం కీలక నిర్ణయం

**ఆరు చరణాలు తప్పనిసరి పాడాలని ఉత్తరువులు**

**న్యూఢిల్లీ, మహా:** జాతీయ గేయం 'వందేమాతరం' పై భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వందేమాతరం ఎక్కడ పాడినా, వినిపించినా మొత్తం ఆరు చరణాలను కలిపి పాడాలని ఉత్తర్వులు జారీ చేసింది.

మిగతా 2లో

## మహా శివరాత్రికి 2243 ప్రత్యేక బస్సులు

**శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249 స్పెషల్ సర్వీసులు**

భక్తులకు ఇబ్బందులు కలగకుండా టీజీఎస్ఆర్టీసీ ఏర్పాట్లు

శివరాత్రి స్పెషల్ కు వర్తించనున్న అదనపు చార్జీలు



02



# దేశాన్ని అమ్మేశారు

(మొదటిపేజీ తరువాయి)

'అమెరికాతో ట్రేడ్ డీల్‌లో ఎలాంటి లాజిక్ లేదు. భారత్ ఎలాంటి దామాషా ప్రయోజనాలు పొందకుండానే సాగిలపడింది. ఇరాన్ నుంచో, రష్యా నుంచో, మరో చోట నుంచో చమురు కొనుగోలు చేయాలని అమెరికా ఎలా నిర్ణయిస్తుంది? మీరు భరతమాతను అమ్మేశారు. మీరు సిగ్గుపడాలి. అమెరికా ఒత్తిడితో మోదీ వణికిపోయారు. దేశాన్ని అమ్మేశారు' అని రాహుల్ విమర్శించారు. ప్రధానమంత్రి కళ్లలో భయం కనిపిస్తోంది. అమెరికా దిగుమతులు 46 బిలియన్ డాలర్ల నుంచి 146 బిలియన్ డాలర్లకు పెరుగుతాయి. మనకు మాత్రం ఎలాంటి కమిట్‌మెంట్ ఇవ్వలేదు. మనం మాత్రం వారికి కమిట్‌మెంట్ ఇచ్చాం. మనం ఫూల్స్‌లా నిలబడ్డాం' అని రాహుల్ తప్పుపట్టారు. మార్షల్ ఆర్ట్స్‌లో వ్యక్తులు పట్టుకోల్పోయి, సరెండర్ అయినట్టే, రాజకీయాల్లో కూడా కొందరు సరెండర్ అవుతుంటారని అన్నారు. 'బ్రదర్ కూడా మొహమాటం పడటం లేదు. పార్లమెంటుకు మోదీ ముఖం చాటేయడం ఎలాంటి ఆశ్చర్యం కలిగించడం లేదు' అని వ్యాఖ్యానించారు. ఎకనామిక్ సర్వేను రాహుల్ ప్రస్తావిస్తూ, తాను రెండు అత్యంత లోతైనా అంశాలను సభకు తెలియజేస్తున్నానని అన్నారు. మొదటిది ప్రపంచ వ్యాప్తంగా భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. అమెరికా ఆధిపత్యాన్ని చైనా, రష్యా వంటి శక్తులు సవాలు చేస్తున్నాయి. రెండవది ఇంధనం, ఆర్థిక వ్యవస్థలను ఆయుధాలుగా మలుచుకుంటున్న తీరు. ఈ పరిణామాలు ప్రపంచాన్ని ఎన్నడూ లేని విధంగా అంచనాలకు అందని స్థితికి నెట్టేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నిరంతర ఘర్షణలే నేటి ప్రపంచ వాస్తవం అన్నారు. అమెరికా డాలర్ ఆధిపత్యం తగ్గుతోందని, డాలర్ సవాళ్లను అర్థం చేసుకోవాలని సూచించారు. ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం వంటి అంతర్గత సమస్యలు, ప్రపంచ అస్థిరతను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్ రూపకల్పన ఉండాలన్నారు.

# హస్తం హవా

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ దాదాపు 70 శాతం మున్సిపాలిటీలను, కార్పొరేషన్లను కైవసం చేసుకోనున్నట్లు పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వేలో వెల్లడయింది. మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబుబ్ నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ జోరు కనిపిస్తున్నట్లు తెలిపింది. కరీంనగర్, నిజమాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను బీజేపీ కైవసం చేసుకునే అవకాశాలు ఉన్నాయని, ఈ రెండు మున్సిపల్ కార్పొరేషన్లలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించనుందని పేర్కొన్నది. అయితే, నిజమాబాద్, కరీంనగర్, మహబుబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఎంఐఎం కింగ్ మేకర్ కావచ్చని తెలిపింది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ ఏ ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ గెలిచే అవకాశాలు లేవని స్పష్టం చేసింది. రామగుండంలో కాంగ్రెస్ 3034, బీఆర్ఎస్ 1620, బీజేపీ 36, ఇతరులు 47 వార్డులు గెలుపొందే అవకాశం ఉందని అంచనా వేసింది. మంచిర్యాలలో కాంగ్రెస్ 3943, బీఆర్ఎస్ 812, బీజేపీ 69, ఇతరులు 12 వార్డులు గెలుపొందే అవకాశం ఉందని పీపుల్స్ పల్స్ వెల్లడించింది. కొత్తగూడెంలో కాంగ్రెస్ 2834, బీఆర్ఎస్ 79, సీపీఐ 1416, ఇతరులు 24 వార్డులు గెలుపొందే అవకాశం ఉందని తెలిపింది. మహబుబ్ నగర్ లో కాంగ్రెస్ 2630, బీఆర్ఎస్ 1822, బీజేపీ 68, ఎంఐఎం 24, ఇతరులు 01 వార్డులు గెలుపొందే అవకాశం ఉందని అంచనా వేసింది. నల్లగొండలో కాంగ్రెస్ 2126, బీఆర్ఎస్ 812, బీజేపీ 610, ఎంఐఎం 24, ఇతరులు 12 వార్డులు గెలుపొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. నిజమాబాద్ లో కాంగ్రెస్ 1016, బీఆర్ఎస్ 24, బీజేపీ 2631, ఎంఐఎం 812, ఇతరులు 12 వార్డులు గెలుపొందే అవకాశం ఉందని తెలిపింది. కరీంనగర్ లో కాంగ్రెస్ 1416, బీఆర్ఎస్ 1012, బీజేపీ 2429, ఎంఐఎం 69, ఇతరులు 13 వార్డులు గెలుపొందే అవకాశం ఉందని పీపుల్స్ పల్స్ వెల్లడించింది. 6876 మున్సిపాలిటీలను అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోనుందని అంచనా వేసింది. 2936 మున్సిపాలిటీలను ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్, 35 బీజేపీ, 01 ఎంఐఎం గెలుచుకునే అవకాశం ఉందని తెలిపింది. 814 మున్సిపాలిటీల్లో 'నువ్వా నేనా?' అన్నట్టు పోటీ ఉందని పీపుల్స్ పల్స్ వివరించింది. 116 మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ పార్టీకి 36 శాతం, బీఆర్ఎస్ కు 29.7 శాతం, బీజేపీకి 19.3 శాతం, ఏఐఎంఐకు 2 శాతం ఓట్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. కాంగ్రెస్ పార్టీ 1210 1290, బీఆర్ఎస్ 860930, బీజేపీ 250270, ఏఐఎంఐఎం 3544, సీపీఐ 1217, సీపీఎం 1014, ఇతరులు 90110 వార్డులు గెలుపొందే అవకాశం ఉందని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది.

## ఎంపీ అర్వింద్, జగ్గారెడ్డి, గంగులపై కేసుల నమోదు

### ఎన్నికల సందర్భంగా గీత దాటిన నేతలు

(మొదటిపేజీ తరువాయి)

పోలింగ్ సిబ్బంది, పోలీసులపై దుర్భాషలాడినందుకు ఆయనపై కేసు నమోదు చేశారు. పోలింగ్ కేంద్ర వద్ద పోలీసోడికి ఒళ్ళు బలిసిందా? యూజ్లెస్ ఫెలోస్.. కళ్ళు నెత్తికి ఎక్కినయా పోలీసులకి? అంటూ తీవ్ర పదజాలం ఉపయోగించడంతో కేసు పెట్టారు. పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పై ఎస్ ఈసీ సిరయస్ అయింది. పోలింగ్ కేంద్రం వద్దకు వెళ్ళి తన అనుచరుడి గల్లా పట్టారంటూ సీఐని బూతులు తిట్టడంతో స్పందించిన రాష్ట్ర ఎన్నికల సంఘం తక్షణమే జగ్గారెడ్డి పై అధికారులు కేసు నమోదు చేసి రిపోర్టు చేయాలని స్థానిక ఎస్పీకి ఆదేశాలు జారీచేసింది. కరీంనగర్ లో గీత దాటిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పైనా పోలీసులు కేసులు నమోదుచేశారు.

# తెలంగాణకు కేంద్రం గుడ్ న్యూస్

(మొదటిపేజీ తరువాయి)

సాధారణంగా గూడ్స్ రైళ్లకు మైనర్ రిపేర్లు వస్తే.. కాజీపేట లేదా రామగుండం స్టేషన్లకు తరలించి నిర్వహిస్తారు. కానీ ఇప్పుడు ఏర్పాటు చేయనున్న ఈ మెగా ఫ్రైట్ ఓవర్ హాలింగ్‌లో.. రైలు వ్యాగన్‌ను పూర్తిగా వేరు చేసి.. ఏ భాగంలో అయితే సమస్య ఉందో దాన్ని గుర్తించి.. సరి చేసి తిరిగి బిగిస్తారు. ఈ సెంటర్‌లో గూడ్స్ వ్యాగన్లు, వాటి నిర్వహణ, ఓవర్ హీలింగ్ వంటి వాటిని చేపడతారు. ప్రస్తుతం రామగుండం, బెల్లంపల్లి, కాజీపేటలో ఇలాంటి సౌకర్యాలు ఉన్నాయి. అవి కూడా సాధారణ మెయింటెనెన్స్ మాత్రమే నిర్వహిస్తున్నాయి. ఈ ప్రక్రియ వల్ల సరుకు రవాణా చేసే రైళ్లు మరింత వేగంగా, సురక్షితంగా ప్రయాణించగలవు. ప్రస్తుతం తెలంగాణలోని వ్యాగన్లను రిపేర్ చేయడం కోసం ఆంధ్రప్రదేశ్‌లోని రాయనపాడుకు తరలిస్తున్నారు. ఈ కొత్త సెంటర్ నిర్మించి అందుబాటులోకి తీసుకువస్తే ఆ ఇబ్బందులు తప్పి, ఖర్చులు కూడా కలిసి వస్తాయని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

# నేడు భారత్ బంద్

### రవాణా, బ్యాంకింగ్ సర్వీసులకు అంతరాయం

(మొదటిపేజీ తరువాయి)

కేంద్ర ప్రభుత్వం నోటిపై చేసిన నాలుగు కొత్త కార్మిక కోడ్‌లు వివాదాస్పదంగా మారాయి. ఇవి కార్మికులపై ప్రతికూల ప్రభావం చూపించనున్నాయని, ఇందువల్ల ఉద్యోగ భద్రత తగ్గిపోతుందని, ఉద్యోగులను తొలగించడం యజమానులకు తేలికవుతుందని కార్మిక సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. ప్రైవేటీకరణ, వేతనాల్లో వృద్ధి లేకపోవడం, సామాజిక భద్రత కొరవడటం జరుగుతుందని చెబుతున్నాయి. మరోవైపు భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై రైతు సంఘాలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఒప్పందం దేశీయ వ్యవసాయరంగాన్ని దెబ్బతీస్తుందని చెబుతున్నాయి. దేశవ్యాప్త బంద్‌లో సుమారు 30 కోట్ల మంది కార్మికులు భాగస్వాములు కానున్నట్టు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ తెలిపారు. ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్‌ఎంసీ, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఎస్ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్‌పీఎఫ్, యూటీయూసీలు ఈ బంద్‌లో పాల్గొంటున్నాయి. సంయుక్త కిసాన్ మోర్చా, ఆల్ ఇండియా కిసాన్ సభ సహా పలు రైతు సంఘాలు బంద్‌కు మద్దతు ప్రకటించాయి.

# మహా శివరాత్రికి 2243 ప్రత్యేక బస్సులు

### శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249 స్పెషల్ సర్వీసులు

### భక్తులకు ఇబ్బందులు కలగకుండా టీజీఎస్ఆర్టీసీ ఏర్పాట్లు

### శివరాత్రి స్పెషల్ కు వర్తించనున్న అదనపు చార్జీలు



**హైదరాబాద్, మహా :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు రవాణా పరమైన అసౌకర్యం కలగకుండా టీజీఎస్ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 2243 ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ నెల 15న మహా శివరాత్రి కాగా, ఈనెల 14 నుంచి 16వ తేది వరకు ఈ ప్రత్యేక బస్సులను సంస్థ నడపనుంది. ప్రధానంగా శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71తో పాటు రాష్ట్రంలోని కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. హైదరాబాద్ లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కె.పి.హెచ్.బి, బీహెచ్ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు భక్తులకు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో షామియానాలు, చైర్లు, తాగునీరుతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తోంది. శివరాత్రికి నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో 1.5 టైమ్స్ వరకు టికెట్ ధరలను సవరించింది. రెగ్యులర్ సర్వీస్ ల టికెట్ చార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ నెల 14 నుంచి 16 తేది వరకు నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఏడుపాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15 వతేది నుంచి 17 తేది వరకు(మూడు రోజులు) సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేస్తుంది. "శివరాత్రి ఆపరేషన్స్ పై ఉన్నతాధికారులతో సంస్థ వీసీ అండ్ ఎండీ వై.నాగిరెడ్డి ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలంకు వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించామని, టికెట్ల బుకింగ్ ను www.tgsrtcbus.in వెబ్ సైట్ లో బుక్ చేసుకోవచ్చని, మహా శివరాత్రి స్పెషల్ బస్సులకు సంబంధించిన సమాచారం కోసం టీజీఎస్ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 04069440000, 040 234500332లలో సంప్రదించవచ్చని తెలిపారు.

# నటుడిని మించిపోయావ్

### దువ్వాడకు జగన్ క్లాస్

**అమరావతి, మహా:** ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఫైర్ అయ్యారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో జగన్‌ను దువ్వాడ కలిశారు. ఈ సందర్భంగా దువ్వాడకు జగన్ క్లాస్ తీసుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ నుంచి సస్పెండ్ అయిన తర్వాత తొలిసారి జగన్‌తో దువ్వాడ భేటీ అయ్యారు. అసలు నువ్వేం చేస్తున్నావో నీకైనా అర్థం అవుతుందా? నీలాగా సినిమా నటులు కూడా చేయరు"అంటూ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ కి జగన్ క్లాస్ పీకారు. లేదు సార్ నేను ఇప్పుడు పూర్తిగా మారిపోయానని బదులిచ్చారు. మండలిలో తాను ఎలా వ్యవహరించాలని అడిగిన దువ్వాడకు.. పరిస్థితిని బట్టి మాట్లాడాలని జగన్ సూచించారు. ఈ నేపథ్యంలో దువ్వాడ మాట్లాడుతూ 2029 ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీదే విజయమని ఎమ్మెల్సీ దువ్వాడ పేర్కొన్నారు.

# జీహెచ్ఎంసీ విభజనను వ్యతిరేకిస్తున్నాం

### ఇది చట్ట వ్యతిరేకం.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

బుధవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జీహెచ్ఎంసీ విభజనపై ఎటువంటి అభిప్రాయ సేకరణ చేయకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారు. జనాభా లెక్కలకు సంబంధించిన నోటిఫికేషన్ వచ్చిన తర్వాత రెవెన్యూ గ్రామాలు, వార్డుల విభజన చేయకూడదని దేశవ్యాప్తంగా రాజ్యాంగబద్ధంగా నోటిఫికేషన్ ఇచ్చారు. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం గజ్వేల్, నల్లగొండ, హైదరాబాద్ కార్పొరేషన్లను విభజించింది. ఇది పూర్తిగా చట్టవ్యతిరేక నిర్ణయం. జీహెచ్ఎంసీతో పాటు సైబరాబాద్, మల్కాజ్‌గిరి పేర్లతో కొత్త కార్పొరేషన్లు ఏర్పాటు చేసి, 300 వార్డులు, 60 సర్కిళ్లతో నగర పాలన పునర్వ్యవస్థీకరణ చేశారు. 31 డిసెంబర్ 2025 తర్వాత ఎలాంటి మార్పులు చేయరాదని, అవసరమైతే మే 2027 వరకు వేచి చూడాలని సెన్సస్ డైరెక్టరేట్ స్పష్టంగా పేర్కొన్నట్లు తెలిపారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఆ మార్గదర్శకాలను ఉల్లంఘించి ఓఆర్ఆర్‌ను సరిహద్దుగా తీసుకుంటామని చెప్పినా, కొన్ని ప్రాంతాలు ఓఆర్ఆర్ బయట, మరికొన్ని లోపల ఉంచడం జరిగింది. ఎయిర్‌పోర్టు, బీహెచ్ఈఎల్, ఇక్రిసాట్ వంటి కీలక ప్రాంతాలను జీహెచ్ఎంసీ పరిధి నుంచి మినహాయించింది. రాష్ట్రానికి జీహెచ్ఎంసీ పరిధి నుంచే సుమారు 70 శాతం ఆదాయం వస్తోంది. వాటర్ వర్క్స్ సంస్థలు ఆర్థిక సంక్షోభంలో ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆర్ఆర్ ట్యాక్స్ పేరుతో అధిక వసూళ్లకు పాల్పడుతోందని విమర్శించారు.

# తమన్నానే రైట్

**మహా:** కర్ణాటక ప్రభుత్వ ఆధ్వర్యంలోని ప్రతిష్ఠాత్మక 'కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్' (కేఎస్‌డీఎల్) ఉత్పత్తులకు బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ సినీ నటి తమన్నా భాటియా ప్రస్థానం అధికారికంగా ప్రారంభమైంది. ఆమె రెండేళ్ల పాటు ఈ బాధ్యతల్లో కొనసాగుతారు. ఇదే సందర్భంలో, చారిత్రక మైసూర్ శాండల్ సోప్‌ను సరికొత్త, ఆధునిక రూపురేఖలతో తిరిగి మార్కెట్లో ప్రవేశపెడుతున్నట్లు కర్ణాటక భారీ, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి ఎం.బి. పాటిల్ ప్రకటించారు. యువతను ఆకట్టుకోవడం ద్వారా కంపెనీ ఉత్పత్తులకు మార్కెట్‌లో మరింత ప్రాచుర్యం కల్పించే వ్యూహంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి తెలిపారు. సోషల్ మీడియాలో 30 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్న తమన్నా నియామకం ద్వారా, ముఖ్యంగా ఉత్తర భారత మార్కెట్‌లో కూడా మైసూర్ శాండల్ సోప్‌కు బలమైన డిమాండ్ సృష్టించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా కన్నడ నటీమణులేలేరా.. తమన్నాను ఎందుకుతెచ్చారంటూ వచ్చిన విమర్శలపై మంత్రి క్లారిటీ ఇచ్చారు. అనేక ఆప్షన్లు పరిశీలించే ఫైనల్ గా తమన్నాను సెలెక్ట్ చేశామని, ఉత్తరాదిలోనూ బ్రాండ్ పాపులర్ అవుతుందన్నారు.

# వందేమాతరంపై కేంద్రం కీలక నిర్ణయం

### ఆరు చరణాలు తప్పనిసరి పాదాలని ఉత్తరువులు

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రపతికి సంబంధించిన కార్యక్రమాలు మొదలుకొని అన్ని ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో వందేమాతరం గేయాన్ని తప్పనిసరి చేస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు పాఠశాలల్లో వందేమాతరం మొదటి రెండు చరణాలను మాత్రమే పాడేవారు. అయితే ఇకపై ఆరు చరణాలు పాడుతూ, భవిష్యత్తు తరాలకు ఈ గేయంపై గౌరవం పెంచేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వందేమాతం పాడే ప్రతి చోటా ఆరు చరణాలు తప్పనిసరిగా వాడుకలో ఉండేలా చూడాలని రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. వందేమాతరం పాడేటప్పుడు ప్రతి ఒక్కరూ గౌరవ సూచకంగా నిల్చోవాలని, గేయాన్ని ఆలపించేటప్పుడు ఇతరులను ఇబ్బందిపెడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది. అన్నింటి కంటే ముఖ్యంగా ఇక నుంచి జాతీయ గీతం జనగణ మన కంటే ముందుగా వందేమాతరం ఆలపించాల్సి ఉంటుంది. వందేమాతరం ఆరు చరణాలను 3 నిమిషాల 10 సెకన్ల వ్యవధిలో పూర్తి చేయాల్సి ఉంటుంది.

# కాంగ్రెస్ ప్రభంజనం ఖాయం


### 90 శాతం స్థానాలు గెలుస్తాం.. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ధీమా

**నిజామాబాద్, మహా:** తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించనుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పోలింగ్ సరళిని గమనిస్తే అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యంలో నిలవబోతోందని మహేశ్ గౌడ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ప్రజాపాలనకు, సంక్షేమ పథకాలకు పట్టణ ఓటర్లు మద్దతు పలికారని ఆయన వివరించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో పూర్తి సంతృప్తి ఉందని, ఈ ఫలితాలతో అది నిరూపితమవుతుందని తెలిపారు. ఆరు గ్యారంటీల అమలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు ప్రజల ఆదరణ చూరగొన్నాయని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం సానుకూల ఫలితాలను ఇస్తుందని చెప్పారు. ఎన్నికల్లో గెలుపు కోసం శ్రమించిన ప్రతి కార్యకర్తకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# కొత్త సీఎస్ ఎవరు...?

### అప్పుడే మొదలైన చర్చ.. మార్చి నెలాఖరులో రామకృష్ణారావు రిటైర్


### ప్రధానంగా వినిపిస్తున్న జయేష్ రంజన్ పేరు



**హైదరాబాద్, మహా :** తెలంగాణ రాష్ట్ర ప్రస్తుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మార్చి 31న పదవీ విరమణ చేయనున్నారు. వాస్తవానికి ఆయన 2025 ఆగస్టు 30న పదవీ విరమణ చేయాల్సి ఉంది. అయితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి మేరకు కేంద్ర ప్రభుత్వం ఆయన పదవీ కాలాన్ని మరో ఏడు నెలల పాటు అంటే ఈ ఏడాది మార్చి 31 వరకూ పొడిగించారు. అందుకే మరోసారి ఆయనకు పొడిగింపు వచ్చే అవకాశం లేదని భావిస్తున్నారు. ఆయన పదవీ విరమణ దగ్గర పడుతుండటంతోనే, ఇప్పుడు కొత్త సీఎస్ ఎంపికపై చర్చ మొదలైంది. నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రేసులో సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రస్తుత పరిణామాలను గమనిస్తుంటే, 1992 బ్యాచ్‌కు చెందిన ఆయన ఈ అత్యున్నత పదవికి ప్రధాన పోటీదారుగా ఉన్నట్లు సచివాలయ వర్గాల సమాచారం. రాష్ట్ర పరిపాలనా యంత్రాంగంపై పూర్తి పట్టు ఉండటంతో పాటు, గత దశాబ్ద కాలంగా కీలక శాఖల్లో ఆయన అందించిన సేవలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ఈ దిశగా మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం జయేష్ రంజన్ మెట్రోపాలిటన్ ప్రాంతం, పట్టణాభివృద్ధి శాఖకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని పట్టణ పాలనతో పాటు.. యువజన పురోగతి, పర్యాటక, సాంస్కృతిక శాఖ, క్రీడల శాఖ , పురావస్తు శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా, దేశవ్యాప్తంగా యువ సివిల్ సర్వెంట్లకు మార్గనిర్దేశం చేసే నేషనల్ పూల్ ఆఫ్ ట్రైనర్స్ ఇన్ లీడర్‌షిప్‌లో ఆయన సభ్యులుగా కొనసాగుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఐటీ, పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖల సారథిగా జయేష్ రంజన్ చెరగని ముద్ర వేశారు. దాదాపు పదేళ్ల పాటు ఈ శాఖలను పర్యవేక్షించిన ఆయన, రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడంలో కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా భారత్‌లోనే అతిపెద్ద స్టార్టప్ ఇంక్యుబేటర్ అయిన 'టీహబ్' ఏర్పాటు, వినూత్నమైన ఐటీ , పారిశ్రామిక విధానాల రూపకల్పనలో ఆయన కృషి మరువలేనిది. విదేశీ పర్యటనల ద్వారా గ్లోబల్ ఇన్వెస్టర్లను తెలంగాణ వైపు ఆకర్షించడంలో ఆయన ప్రత్యేకత చూపిస్తారు.

జయేష్‌రంజన్ 1992 ఐఏఎస్ బ్యాచ్ ఆల్ ఇండియా టాపర్‌గా నిలిచారు. ఐఐఎం కలకత్తా , సింగపూర్‌లోని లీ క్వాన్ యూ స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి విద్యనభ్యసించిన ఆయన, విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడంలో దిట్టగా పేరు పొందారు. గత ఏడాది కాలంగా వివిధ పాలనాపరమైన మార్పుల్లో భాగంగా డిసెంబర్ 2025లో ఆయన పరిశ్రమల శాఖ నుంచి పట్టణాభివృద్ధి శాఖకు బదిలీ అయ్యారు. రాష్ట్ర బ్యూరోక్రసీలో అగ్రస్థానంలో మార్పులు జరగనున్న తరుణంలో, జయేష్ రంజన్ అనుభవం , ప్రభుత్వ ప్రాధాన్యతలపై ఆయనకున్న అవగాహన సీఎస్ పదవికి ఆయనను ముందు వరుసలో నిలబెడుతున్నాయి. అధికార వర్గాల్లో ఉన్న క్లీన్ ఇమేజ్, పాలనాపరమైన కొనసాగింపు దక్కుతుందన్న నమ్మకం అధికార వర్గాల్లో ఉంది. ప్రభుత్వం త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది. జయేష్ రంజన్ కంటే సీనియర్లు శశాంక్ గోయల్, అరవింద్ కుమార్ ఉన్నారు. అరవింద్ కుమార్ పై ఫార్ములా ఈ రేసు కేసు ఉంది. దాంతో ఆయన పేరు పరిశీలనలోకి తీసుకునే అవకాశం లేదు. మరో సీనియర్ అధికారి వికాస్ రాజ్ కూడా రేసులో ఉన్నారు. అయితే ప్రభుత్వ పెద్దలకు అన్నీ తానై వ్యవహరించే జయేష్ రంజన్ కే ఎక్కువ అవకాశాలు ఉన్నట్లుగా భావిస్తున్నారు.




# డాక్టర్ శ్రీలీల

### ఎంబీబీఎస్ పట్టా అందుకున్న అందాల నటి

**మహా:** అందాల హీరోయిన్ శ్రీలీల ఇప్పుడు అధికారికంగా డాక్టర్ అయ్యారు. సినిమాల్లో నటిస్తూనే ఆమె వైద్య విద్యను అభ్యసించారు. ఆమె ముంబైలోని డివై పాటిల్ విశ్వవిద్యాలయంలో ఎంబీబీఎస్ పూర్తి చేసి వైద్య పట్టాను అందుకున్నారు. ఫిబ్రవరి 10న జరిగిన ఈ వేడుకకు సంబంధించిన చిత్రాలు, వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. అభిమానులు, పలువురు నెటిజన్లు ఆమెకు శుభాకాంక్షలు చెబుతున్నారు. ఒక చిత్రంలో వేదికపై మెరూన్ రంగు దుస్తులు ధరించిన శ్రీలీల స్నాతకోత్సవ వేడుకలో డిగ్రీని స్వీకరించింది. తన ఇంట్లో జరిగిన ఒక సంఘటన కారణంగా తాను డాక్టర్ కావాలని నిర్ణయించుకున్నట్లు శ్రీలీల ఒక సందర్భంలో వెల్లడించారు. ఓసారి తన అమ్మమ్మ కిందపడిపోయినప్పుడు, వైద్యుడైన తన అన్నయ్య వచ్చి చిన్నపాటి చేయడంతో ఆమె మామూలు స్థితికి వచ్చిందని అన్నారు. అప్పుడే తాను డాక్టర్ కావాలని నిర్ణయించుకున్నట్లు వెల్లడించారు. ఆ కారణంగానే సినిమాల్లోకి వచ్చినప్పటికీ డాక్టర్‌గా సేవ చేయాలన్న తన సంకల్పాన్ని వదల్లేదని అన్నారు.

# మహా విభజన

(మొదటిపేజీ తరువాయి)

దీనికి సంబంధించి జిహెచ్ఎంసి చట్టం1955లోని సెక్షన్3(1) ప్రకారం అధికారిక గెజిట్ విడుదల కావడంతో బుధవారం నుంచి నూతన కార్పొరేషన్లు విడివిడిగా కార్యకలాపాలు ప్రారంభించాయి పరిపాలనా సంస్కరణల్లో భాగంగా హైదరాబాద్ మహానగర పరిధిలోని కీలక మున్సిపల్ కార్పొరేషన్లకు కొత్త కమిషనర్లు నియమితులయ్యారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కమిషనర్‌గా ఆర్.వి. కర్ణన్ బాధ్యతలు స్వీకరించగా, ఐటీ కారిడార్‌తో కూడిన కీలకమైన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (ఎస్ఎంసీ) బాధ్యతలను జి. శ్రీజన చేపట్టారు. మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కమిషనర్‌గా టి. వినయ్ కృష్ణారెడ్డి విధుల్లో చేరారు. ఔటర్ రింగ్ రోడ్ వరకు ఉన్న 2 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణాన్ని తెలంగాణ ప్రధాన పట్టణ ప్రాంతంగా ప్రభుత్వం గుర్తించింది. ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి సాధించాలనే సంకల్పంతో 2024 సెప్టెంబరులో 51 గ్రామాలను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేశారు. ఆ తర్వాత 20 మున్సిపాలిటీలు, 7 నగర పాలక సంస్థలను కూడా జిహెచ్ఎంసిలో కలిపారు. ఈ విలీనాల అనంతరం డివిజన్ల పునర్విభజన పూర్తి చేసి నగరాన్ని 300 డివిజన్లుగా, 60 సర్కిళ్లుగా, 12 జోన్లుగా వర్గీకరించారు. ఫిబ్రవరి 10, 2026 నాటికి పాత పాలకమండలి గడువు ముగియడంతో వెంటనే ఈ విభజన ప్రక్రియ అమల్లోకి వచ్చింది. నూతనంగా ఏర్పడిన ఈ 3 కార్పొరేషన్ల ద్వారా స్థానిక సమస్యల పరిష్కారం వేగవంతం కానుంది. పౌర సేవలు ప్రజలకు మరింత చేరువ చేయడమే కాకుండా, మౌలిక సదుపాయాల కల్పనలో స్పష్టత తీసుకురావడానికి ఈ విభజన దోహదపడుతుంది. ఒక్కో కార్పొరేషన్ తన పరిధిలోని నిధులను, వనరులను స్వయంప్రతిపత్తితో వినియోగించుకునే అవకాశం ఉంటుంది. ఈ క్రమబద్ధీకరణ ద్వారా హైదరాబాద్ మహానగరం ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చెందుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ)**

పాత జీహెచ్ఎంసీలోని కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్లకు విలీనమైన మణికొండ, నార్సింగి, తెల్లాపూర్, అమీన్‌పూర్, బొల్లారం, నిజాంపేట్, దుండిగల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, మేడ్చల్ పట్టణ స్థానిక సంస్థలు కలిశాయి. కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్లతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(సీఎంసీ) ఏర్పాటు చేశారు. శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాలు పూర్తిగా, పటాన్‌చెరు, కూకట్‌పల్లి, మేడ్చల్, రాజేంద్రనగర్ నియోజకవర్గాలు పాక్షికంగా ఉన్నాయి.

**మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసీ)**

పాత జీహెచ్ఎంసీలోని సికింద్రాబాద్, ఎల్బీనగర్ జోన్లు పాక్షికంగా విలీనమైన బోడుప్పల్, ఫీర్జాదిగూడ, పోచారం, నాగారం, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, జవహర్‌నగర్, తూముకుంట యూఎల్‌బీలతో మల్కాజిగిరి, ఎల్బీనగర్, ఉప్పల్ జోన్లు అయ్యాయి. వాటితో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్(ఎంఎంసీ) ఏర్పాటు చేశారు. మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్బీనగర్, సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గాలు పూర్తిగా, మేడ్చల్, కూకట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాలు పాక్షికంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కిందకు వచ్చాయి.

**జీహెచ్ఎంసీ..**

పాత గ్రేటర్ పరిధిలోని ఖైరతాబాద్, చార్మినార్ జోన్లు సికింద్రాబాద్, ఎల్బీనగర్ జోన్లలోని కొన్ని ప్రాంతాలు, శంషాబాద్, జల్‌పల్లి, బండ్లగూడ జాగీర్, బడంగ్‌పేట్, తుక్కుగూడ, ఆదిభట్ల, మీర్‌పేట్, తుర్కయాంజాల్, పెద్దఅంబర్‌పేట యూఎల్‌బీలతో ఖైరతాబాద్, సికింద్రాబాద్, చార్మినార్,గోల్కొండ, శంషాబాద్, రాజేంద్రనగర్ జోన్లు అయ్యాయి. వాటితో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేశారు. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, ముషీరాబాద్, మలక్‌పేట్, అంబర్‌పేట, సనత్‌నగర్, నాంపల్లి, కార్వాన్, గోషామహల్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, యాకుత్‌పుర, బహదూర్‌పుర, సికింద్రాబాద్ నియోజకవర్గాలు పూర్తిగా, ఇబ్రహీంపట్నం, రాజేంద్రనగర్, మహేశ్వరం నియోజకవర్గాలు పాక్షికంగా ఉన్నాయి.

**మూడు కార్పొరేషన్లకు స్పెషల్ ఆఫీసర్**

గ్రేటర్ కాల పరిమితి పూర్తి కావటంతో మూడు కార్పొరేషన్లకు స్పెషల్ ఆఫీసర్‌గా జయేష్ రంజన్ కు బాధ్యతలు అప్పగించారు. కొత్త పాలకమండలి వచ్చే వరకు స్పెషల్ ఆఫీసర్‌గా జయేష్ రంజన్ కొనసాగనున్నారు. అదే విధంగా మల్కాజ్‌గిరి జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్.పంకజ ను నియమించారు. హైదరాబాద్ ఈడీగా సామ్రాట్ అశోక్, సైబరాబాద్ ఈడీగా ఎం.సంతోష్, లోక్‌భవన్ జాయింట్ సెక్రటరీగా కె.కిరణాచారి నియమితులయ్యారు.

మహా పత్రిక 03
తెలుగు
గురువారం, తిరుపతి | 12-02-2026 | జిల్లా వార్తలు | DISTRICT NEWS | WWW.MAHAADAILY.COM

# ఓటు హక్కు వినియోగించుకున్న యువత...

- జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్...
- జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలకు ఎన్నికలు...
- నేను సైతం అంటూ... ఓటేసిన వృద్ధులు....
- ఇబ్రహీంపట్నంలో ఉద్రిక్తత.. ఇద్దరి అరెస్ట్...





**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** స్వతంత్ర భారతదేశంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బడుగు బలహీన వర్గాలకు కల్పించిన ఓటు హక్కును ప్రజలు వినియోగించుకున్నారు. రాష్ట్రంలో జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికలలో ముసలి ముతక, యువతి యువకులు పాల్గొని తమ ఓటు హక్కును విజయవంతంగా వినియోగించుకోవడం జరిగింది. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లు జరగకుండా, తప్పిదాలకు తవ్వివకుండా, సజావుగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఎన్నికలు, జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. గత నెల 27వ తారీకు నుంచి మొదలైన ఎన్నికల ప్రక్రియ ఈనెల 11వ తారీకు పోలింగ్తో ముగిసింది. అభ్యర్థులు తమ ప్రత్యర్థులపై ఎత్తులకు పైఎత్తులు వేస్తూ ఎన్నికలలో హోరాహోరీగా ప్రచారం చేయడం జరిగింది. ఎన్నికలలో ఎలాగైనా పై చేయి సాధించాలని పట్టుదలతో ఎంత ఖర్చుకైనా వెనకాడకుండా ఓటర్లను ఆకర్షిస్తూ ఓటు వేయించుకునేలా పోటాపోటీగా ప్రచారం చేశారు.

**జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలకు ఎన్నికలు...**

రంగారెడ్డి జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలు చేవెళ్ల, మొయినాబాద్, ఇబ్రహీంపట్నం, షాద్నగర్, ఆమనగల్లు, శంకర్పల్లి మున్సిపాలిటీలలో ఎన్నికలు జరిగాయి. ఈ మున్సిపాలిటీ ఎన్నికలలో ఓటర్లు ఓటు వేసేందుకు ఆసక్తి కనబరిచారు దాదాపు జిల్లాలో 80 శాతం పోలింగ్ నమోదైనట్లు జిల్లా ఎన్నికల అధికారి సి నారాయణరెడ్డి వెల్లడించారు. జిల్లాలో అక్కడక్కడ పోలింగ్ కేంద్రాల వద్ద స్వల్ప ఉద్రుతలు జరిగిన ప్రాంతాలలో పోలీసులు ఆందోళన కారణాలు చదరగొట్టి, ఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు చేపట్టారు.

**పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్...**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం రంగారెడ్డి జిల్లాలో 6 మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికలు నిర్వహిస్తున్న సందర్భంగా, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, చేవెళ్ళ మండలంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ నిర్వహణను, ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పోలింగ్ స్టేషన్ ఆవరణలో పోటీ చేయు వార్డు సభ్యుల జాబితాను పరిశీలించారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్లో నమోదు చేయాలనీ సంబంధిత రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. రేపు జరగబోయే ఓట్ల లెక్కింపులో ఎక్కడ కూడా పొరపాట్లకు తావివ్వకుండా బాధ్యతతో విధులు నిర్వహించాలని అధికారులను హెచ్చరించారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే ఎవరిని కూడా ఉపేక్షించేది లేదని, వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

**నేను సైతం అంటూ... ఓటేసిన వృద్ధులు....**

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని పదవ వార్డ్ ఖానాపూర్ గ్రామంలో వయోవృద్ధులు యువకులు మహిళలు తమ ఓటును వినియోగించుకోవడం కోసం పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నేను సైతం అంటూ.. వీల్ చైరుకు పరిమితమైన వ్యక్తి, వృద్ధులు ఈ ఎన్నికలలో పాల్గొని తన ఓటును వినియోగించుకోవడం జరిగింది.

**ఇబ్రహీంపట్నంలో ఉద్రిక్తత.. ఇద్దరి అరెస్ట్...**

ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడ పోలింగ్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలింగ్ స్టేషన్కు సమీపంలో ఉన్న ఓ ఇంట్లో కొంతమంది ఓటర్లను ప్రలోభ పరుస్తున్నారని గమనించిన పోలీసులు వారిని చెదరగొట్టే ప్రయత్నం చేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుందనే గమనించిన పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. దీంతో పరిస్థితి అదుపులోకి వచ్చి పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

## ఓటు ఎవరో వేశారు... నా హక్కు దోచేశారు



**షాద్ నగర్. మహా:** ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి ఉన్న అత్యంత విలువైన హక్కు. కానీ అదే హక్కు తనకుండగానే దోచుకుపోయారని ఒక యువ ఓటరు ఆవేదన వ్యక్తం చేసిన ఘటన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా వెలుగులోకి వచ్చింది. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం లోని 8వ వార్డుకు చెందిన బోడం పాటి చందన ఈసారి తొలిసారిగా ఓటు వేయాలని ఉత్సాహంగా పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ప్రజాస్వామ్య పండుగలో భాగమవ్వాలనే ఆనందంతో బూత్లోకి వెళ్లి తన పేరు చెక్ చేయగా, అధికారులు చెప్పిన మాట ఆమెను షాక్కు గురి చేసింది.మీ ఓటు ఇప్పటికే నమోదైంది.ఎవరో వేసి వెళ్లారు అని సిబ్బంది సమాధానం ఇచ్చారు.దీంతో ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురైన చందన...నాకున్న ఒక్క ఓటు హక్కు ఇలా దోచుకుంటే ఎలా? నేను వేయకుండానే ఎలా నమోదవుతుంది? అంటూ ప్రశ్నించారు. మొదటిసారి ఓటు వేయాలనే ఆశతో వచ్చిన తనకు ఇలా జరగడం బాధాకరమని కన్నీటి పర్యంతమయ్యారు.ఈ ఘటనతో పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా లోపాలపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఓటర్ల వివరాల ధృవీకరణలో నిర్లక్ష్యం కారణమా? లేక బోగస్ ఓటింగ్ జరిగిందా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి.సంబంధిత అధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక్క ఓటు కూడా అమూల్యం.అలాంటి హక్కు దుర్వినియోగం కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఓటర్లు డిమాండ్ చేస్తున్నారు. నాకున్న ఒక ఓటు హక్కు నేనే వేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిందిగా అభ్యర్థించారు. ఓటు హక్కు రక్షణే నిజమైన ప్రజాస్వామ్యానికి బలం అలాంటి ఓటు హక్కు చోరికి గురైతే ఎలా అంటూ అధికారులను నిలదీశారు. సంబంధిత అధికారులు వెంటనే దీనిపై సమగ్ర విచారణ చేపట్టి తమకు న్యాయం చేయవలసిందిగా కోరారు.

## ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ ఎన్నికలు..



**ఆమనగల్లు, మహా:** మున్సిపల్ ఎన్నికకు ఓటర్లు పోటెత్తారు.ఓటర్లు తమ చైతన్యాన్ని చాటారు. రికార్డు స్థాయిలో పోలింగ్ శాతం నమోదైంది. ఉదయం నుంచి ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగగా, ఆ సమయానికి క్యూలో ఉన్నవారికి కూడా ఓటు హక్కు వినియోగించే అవకాశం ఇచ్చారు.పుర పోరులో జనం చైతన్యం వెల్లి విరిసింది. అభివృద్ధి చేసే నాయకుడిని ఎన్నుకునే ఓట్ల పండగలో తాము సైతం.. అంటూ హుషారుగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.నడవడానికి కూడా శక్తి లేని వృద్ధులు, వికలాంగులు సైతం ఓటు వేసేందుకు ఆసక్తిని కనబరచడం ఈ ఎన్నికల పోలింగ్ లో కనిపించింది. ఉదయాన్నే ఓటర్ స్లిప్పు, ఆధార్ గుర్తింపుకార్డులు పట్టుకుని పోలింగ్ స్టేషన్కు చేరుకుని క్యూ లైన్లో నిలుచుని ఉండటం కనిపించింది.ఆమనగల్లు మున్సిపాలిటీలోని 15 వార్డులకు ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మున్సిపాలిటీలోని సాయంత్రం 5 గంటల వరకు 84.74 శాతం పోలింగ్ నమోదైంది.14,392 ఓట్లు పోలయ్యాయని ఎన్నికల అధికారులు వెల్లడించారు. పోలింగ్ సాఫీగా సాగుతుందని అధికారులు తెలిపారు.ఓటు వేసేందుకు వలస ఓటర్లు కూడా గ్రామాలకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు భద్రత ఏర్పాటు చేశారు. కొత్తగా ఓటు వచ్చిన యువతీయువకులు ఉత్సాహంగా ఓటు వేశారు.ఆమనగల్లు మున్సిపాలిటీ కేంద్రంలోని పోలింగ్ కేంద్రాలను మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి, ఏసీపీ జానకిరెడ్డి, సీఐ జానకిరామ్ రెడ్డి పరిశీలించారు. క్యూలైన్ పాటించాలని, సెల్ఫోన్లు, పెన్నులు, వాటర్ బాటిల్స్, ఇంకు బాటిల్స్ వంటి వాటికి అనుమతి లేదన్నారు.అనవసరంగా గుమిగూడనియవద్దని సిబ్బందికి సూచించారు. ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుగుతున్నాయన్నారు.ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో ఇక్కడ భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు నిరంతర నిఘా ఏర్పాటు చేసి, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ఠ చర్యలు చేపట్టారు. దివ్యాంగులు ఎన్నికల అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఓటు వినియోగించు కోవడానికి వచ్చిన వృద్ధులు, దివ్యాంగులు సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారిని పోలింగ్ బూత్లలోకి తీసుకెళ్లేందుకు వాలంటరీలు లేక వీల్చైర్ల సాయంతో కుటుంబ సభ్యులు, ఇతరుల సహకరించారు.




## కట్ట మైసమ్మ దేవాలయ అభివృద్ధికి విరాళం...

**ఆమనగల్లు, మహా:** మాడ్గుల మండలం ఫిరోజ్ నగర్ గ్రామ సమీపంలోని శెట్టిపల్లి చెరువు కట్టపై కొలువుదీరిన కట్ట మైసమ్మ దేవాలయ అభివృద్ధి కోసం గోసుల వెంకటేష్ యాదవ్ తనవంతు సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకునికి యాభై వేల రూపాయల నగదును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోరిన కోరికలు తీర్చే అమ్మవారిగా పేరున్న అమ్మవారి ఆలయ అభివృద్ధి కోసం దాతలు ముందుకు వచ్చి వీరివీగా విరాళాలు అందజేయాలని కోరారు.

## ఫిబ్రవరి 12న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



**ఆమనగల్లు, మహా:** లేబర్ కోడ్స్, విబి రామ్ జి చట్టం, జాతీయ విత్తన విద్యుత్ సవరణ బిల్లులను రద్దు చేయాలని, 1996 కేంద్ర చట్టం రక్షణ కోసం చర్యలు తీసుకోవాలని భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ జహంగీర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణ కేంద్రంలోని బాపూజీ తాపీ మేస్త్రిల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమ్మె కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షులు సుంకర రామ్మోహన్ రావు హాజరవుతారని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.... కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్స్ను రద్దు చేయాలని,విబిజి రామ్ జి బిల్లును రద్దు చేసి, నరేగా పథకాన్ని యదావిధంగా కొనసాగించాలన్నారు. విత్తన, విద్యుత్ చట్టాల సవరణను ఉపసంహరించుకోవాలన్నారు.ఇన్సూరెన్స్ రంగంలో 100% విదేశీ పెట్టుబడులను ఉపసంహరించుకోవాలని, భవన నిర్మాణ కేంద్ర చట్టం1996, అంతర్రాష్ట్ర వలస కార్మికుల చట్టం1979 లను కాంట్రాక్ట్ కార్మికుల చట్టం1970 లను పకడ్బందీగా అమలు చేయాలన్నారు.కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు, కార్మిక సంఘాల ప్రతినిధులతో వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించాలి బోర్డు నిధులు దుబారా కాకుండా కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలన్నారు.,ప్రమాద మరణానికి రూ.10 లక్షలు, సహజ మరణానికి రూ.5 లక్షలు, దహన సంస్కారాల ఖర్చు, ప్రసూతి, వివాహ కానుకలను రూ.లక్షకు పెంచాలని, కనీస పెన్షన్ రూ.9 వేలు ఇవ్వాలి, కేంద్ర చట్టంలోని స్కాలర్షిప్లు, గృహవసతి, అడ్డాల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు.2009లో నమోదు చేసుకున్న కార్మికుల కార్డులు వెంటనే రెన్యువల్, ఈశ్రమ్ గుర్తింపు కార్డులను భవన నిర్మాణ కార్మికులందరికీ అందజేయాలన్నారు. కార్మికులకు అవసరం లేని సిఎస్సి హెల్త్ టెస్టులను రద్దు చేయాలి, 96 కేంద్ర చట్టం నిబంధనలకు విరుద్ధంగా ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇచ్చిన రూ.346 కోట్ల నిధులను తిరిగి వెల్ఫేర్ బోర్డులో జమ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల గౌరవ అధ్యక్షులు గంగిశెట్టి సురేందర్, ముఖ్య సలహాదారి ముక్కరి కృష్ణయ్య, ఉన్నారు.



## బ్యాలెట్ పేపర్ వాట్సాప్ స్టేటస్ లో కలకలం

### 19వ వార్డు మాజీ కౌన్సిలర్ తీరు

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి మున్సిపల్ కు జరిగిన ఎన్నికల్లో మాజీ కౌన్సిలర్ కొమ్ముల సురేష్ ఓటు వేసి బ్యాలెట్ పేపర్ను వాట్సాప్ స్టేటస్ లో పెట్టిన తీరు బుధవారం నాడు చర్చనీయాంశమైంది. బెల్లంపల్లి పట్టణంలోని 19వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిగా స్వతంత్ర అభ్యర్థిగా కొమ్ముల జయ పోటీలో నిలువగా ఆమె తనయుడు మాజీ కౌన్సిలర్ కొమ్ముల సురేష్ 32వనంబర్ పోలింగ్ బూత్ లో తన ఓటును వినియోగించుకున్నారు ఓటు వేసిన బ్యాలెట్ పేపర్ ను తన సెల్ ఫోన్ ద్వారా ఫోటో తీసుకొని స్టేటస్ లో పెట్టుకోవడం పట్టణంలో కలకలం రేపింది.ఓటు హక్కును వినియోగించుకున్న బ్యాలెట్ పేపర్ ను స్టేటస్ ద్వారా పలువురు వీక్షించి వైరల్ కావడంతో ఎన్నికల అధికారులు అవాక్కయ్యారు. పోలింగ్ బూత్ లో కి ఆయన సెల్ ఫోన్ ను ఎలా తీసుకువెళ్లగలిగాడో నని పలువురు అవాక్కవుతున్నారు. ఎన్నికల నిబంధనల ప్రకారం సెల్ఫోన్ ఓటు హక్కును వినియోగించుకునే గదిలో ఉపయోగించడం నిషేధం. కానీ సంబంధిత పోలింగ్ బూత్ కు సంబంధించినఎన్నికల అధికారులు మరియు పోలీసులు తనిఖీలు ఏ మేరకు చోటు చేసుకున్నాయో ఈ సంఘటన ద్వారానే తెలుస్తోంది. ఎన్నికల నిబంధనల మేరకు సెల్ఫోన్ను పోలింగ్ బూత్లలోకి తీసుకురావడం నిషేధం కానీ ఓటు హక్కును వినియోగించుకునే గదిలోకి ఏ విధంగా సెల్ఫోన్ తీసుకువెళ్లాడో, పోలీసుల తనిఖీలు ఏ మేరకు ఉన్నాయో జరిగిన సంఘటనే తార్కాణంగా నిలుస్తోంది.ఇదివరకు ప్రజా ప్రతినిధిగా వార్డు కౌన్సిలర్ గా బాధ్యతలునిర్వహించిన మాజీ కౌన్సిలర్ తన అత్యుత్సాహం ప్రదర్శించి ఓటు హక్కును వినియోగించుకొని సంబంధిత బ్యాలెట్ పేపర్ను వాట్సాప్ స్టేటస్ లో పెట్టుకోవడం ఏ మేరకు సమంజసం అని పలువురు చర్చించుకుంటున్నారు. సంబంధిత అంశంపై ఎన్నికలఅధికారులు మరియు విధి నిర్వహణ ఉన్న పోలీసు సిబ్బంది బాధ్యతరాహిత్యాన్ని ఎన్నికల అధికారులు, పోలీసు శాఖ సంబంధిత బాధ్యత రాహిత్యాన్ని గుర్తించి ఏమేరకు చర్యలు చేపడతారో వేచి చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



### జిల్లా వైద్యాధికారి అర్బన్ హెల్త్ సెంటర్ లో

## ఆకస్మిక తనిఖీ

### రోగుల పట్ల అశ్రద్ధ తగదు సిబ్బందికి హెచ్చరిక

**మందమర్రి, మహా :** మంచిర్యాల జిల్లా వైద్యాధికారి ఎస్ అనిత బుధవారం మందమర్రి దీపక్ నగర్ లోని అర్బన్ హెల్త్ సెంటర్ లో ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. వివిధ రోగాల బారిన పడి ఆసుపత్రికి వచ్చిన రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆమె వెల్లడించారు. మండలంలో వివిధ ఆశ్రమ పాఠశాలలో ఆహార పదార్థాలను, వంట చేసే పని వారిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఆసుపత్రి పరిశుభ్రత కు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అంతేకాకుండా 100 శాతం పేర్లు నమోదు, టీకాలు ఇవ్వడం, క్షయ వ్యాధి కేసులను ముందుగా గుర్తించడము, మొబైల్ ఎక్స్రే ద్వారా మారుమూల ప్రాంతాలలో ఈ సేవలను చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది ఉన్నారు.

## మున్సిపల్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన రామగుండం సిపి

### ఎన్నికల బందోబస్తు పర్యవేక్షణ...పోలింగ్ తీరుపై ఆరా



**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో బుధవారం జరుగుతున్న మున్సిపల్ పోలింగ్ కేంద్రాలను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ఆర్బీహెచ్వీ, క్రిస్ట్ స్కూల్ తదితర పోలింగ్ కేంద్రాలను తాను స్వయంగా సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు, భద్రతాచర్యలు, క్యూలైన్ల నిర్వహణ, వృద్ధులు, దివ్యాంగుల కోసం కల్పించిన ప్రత్యేక సదుపాయాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్కు తరలించే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, శాంతియుతంగా కొనసాగుతోందా అనే అంశంపై కమిషనర్ ప్రత్యక్షంగా ఆరా తీసి, పోలింగ్ అధికారులతో మాట్లాడి అవసరమైన సూచనలు చేశారు. అలాగే ఓటర్లతో కూడా మాట్లాడి, ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే పోలీస్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఎన్నికల శాంతి భద్రతల కోసం పూర్తి స్థాయి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు,ఓటర్లు భయభ్రాంతులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, ఏసీపీ ఆర్ ప్రకాష్, పట్టణ ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు తదితరులు పాల్గొన్నారు.

### శంషాబాద్ జోన్ ను గ్రేటర్ హైదరాబాదులో కలపడాన్ని వ్యతిరేకిస్తూ

## బిఆర్ఎస్ నాయకుల నిరసనలు...



**రాజేంద్రనగర్, మహా :** శంషాబాద్ జోన్ ను గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ లో కలపడాన్ని బిఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. బిఆర్ఎస్ నాయకులు కోన్నమొల్ల శ్రీనివాస్ నేతృత్వంలో బుధవారం శంషాబాద్ ప్రాంతంలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. శంషాబాద్ ప్రజల ఆగ్రహాన్ని భవిష్యత్తు ఎన్నికలలో చూస్తారని మండిపడ్డారు. శంషాబాద్ ప్రజలను హైదరాబాద్ పాతబస్తీ కార్పొరేషన్ లో కలపడాన్ని వ్యతిరేకిస్తూ రోడ్లపై బైఠాయించి నిరసనలు తెలిపారు. ఈ వ్యతిరేకతను భవిష్యత్తు శంషాబాద్ జిహెచ్ఎంసి ఎన్నికలలో ప్రజలు చూపిస్తారని దుయ్యపట్టారు.ఈ కార్యక్రమంలో హరికృష్ణ, కుమ్మరి అర్జున్, పవిత్ర సాగర్, దేవేందర్, శ్రీకాంత్ యాదవ్, శివ ముదిరాజ్, మురళి గౌడ్, గౌస్, యాదగిరి, ఫయాజ్, సురేష్, టిల్లు, చంద్రశేఖర్ యాదవ్, అర్షద్, జాషువా ప్రజాసంఘాల నాయకులు కులసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్ జోన్ను హైదరాబాద్లో కలపొద్దు

### బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్



**రాజేంద్రనగర్ మహా ;** ప్రభుత్వం తాజాగా ప్రతిపాదించిన మూడు కార్పొరేషన్ల ఏర్పాటు అంశంపై వెంటనే పునరాలోచన చేయాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శంషాబాద్ జోన్ను హైదరాబాద్ కార్పొరేషన్లో విలీనం చేయకుండా, ప్రత్యేక శంషాబాద్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.శంషాబాద్లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంచర్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం శంషాబాద్తో పాటు రంగారెడ్డి జిల్లా ఉనికిని బలహీనపరిచే విధంగా చర్యలు తీసుకుంటోందని ఆరోపించారు. శంషాబాద్ జోన్తో పాటు జిల్లాలోని పలు ప్రాంతాలను హైదరాబాద్ కార్పొరేషన్లో విలీనం చేస్తే శంషాబాద్ రంగారెడ్డి జిల్లా గుర్తింపు, పరిపాలనా స్వరూపం తీవ్రంగా దెబ్బతింటుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.రంగారెడ్డి జిల్లాలోని పలు పాత మున్సిపాలిటీలు మరియు జీహెచ్ఎంసీ పరిధిలోని సంబంధిత డివిజన్లను కలిపి శంషాబాద్ను ప్రత్యేక కార్పొరేషన్గా అభివృద్ధి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ రంగ విస్తరణ, పారిశ్రామిక అభివృద్ధితో వేగంగా అభివృద్ధి చెందుతున్న శంషాబాద్కు ప్రత్యేక పరిపాలనా వ్యవస్థ అవసరమన్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు.స్థానిక అవసరాలు, అభివృద్ధి ప్రణాళికలు, భవిష్యత్ దృష్టిని గౌరవిస్తూ ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.శంషాబాద్ను ఎట్టి పరిస్థితుల్లోనూ హైదరాబాద్ కార్పొరేషన్లో విలీనం చేయకూడదని, ఈ విషయంపై ప్రభుత్వం వెంటనే స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తెలంగాణ ఉద్యమం తరహాలో మరో ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుట్టడానికైనా బిఆర్ఎస్ పార్టీ వెనకాడబోదని హెచ్చరించారు. ప్రజల హక్కులు, శంషాబాద్ ఉనికి కాపాడేందుకు బీఆర్ఎస్ పార్టీ ప్రజలతో కలిసి ప్రజా ఉద్యమం చేపడతామని మంచర్ల శ్రీనివాస్ స్పష్టం చేశారు.



## బెల్లంపల్లిలో ముగిసిన ఎన్నికల పోలింగ్

**బెల్లంపల్లి ,మహా:** బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికలు ముగిసాయి. పట్టణంలో 44,554 మంది ఓటర్లు ఉండగా 33,350 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు మొత్తం గా 74.85% పోలింగ్ నమోదు అయినట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. సంబంధిత 34 వార్డులకు గాను 68 పోలింగ్ స్టేషన్లో ఏర్పాటుచేసి ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఎన్నికల అధికారులు మరియు పోలీసు శాఖ చర్యలను చేపట్టింది అయితే బెల్లంపల్లి పట్టణంలోని 29వ వార్డులో టిఆర్ఎస్ అభ్యర్థి గులాబీ రంగుతో కారు గుర్తును మరియు అభ్యర్థి ఫోటోతో కూడిన బ్యాలెట్ పేపర్ పై ఓటర్లకు స్లిప్ నంబర్లు రాసి ఇచ్చి ఓటర్లను ప్రభావితం చేసిన సంఘటనను సంబంధిత కాంగ్రెస్, బిజెపి ,ఇండిపెండెంట్ అభ్యర్థులు తీవ్రంగా పరిగణించి ఎన్నికల అధికారి సంపత్ రెడ్డికి ఆధారాలతో సహా ఫిర్యాదు చేయడం జరిగింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బెల్లంపల్లి ఏసీపి రవికుమార్ ఆధ్వర్యంలో వన్టౌన్ శ్రీనివాసరావు ప్రత్యేక బందోబస్తును చేపట్టడం జరిగింది.

### చెదురు మధురు సంఘటనలు మినహా

## మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతం

### చెన్నూరు నియోజకవర్గంలో పోటాపోటిగా ఎన్నికలు

**మంచిర్యాల, మహా :** మంచిర్యాల జిల్లాలో చెదురు మధురు సంఘటనలు మినహా మున్సిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి.తెలంగాణ రాష్ట్రంలో రెండవ దప నిర్వహించిన మున్సిపల్ ఎన్నికలు మంచిర్యాల జిల్లాలో అధికార పార్టీ కాంగ్రెస్, భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) భారతీయ జనతా పార్టీ (భాజాపా) లు తమ ఆధిపత్యం నిలుపుకునేందుకు పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాయి. నిన్నటి వరకు ఓటర్లకు కౌన్సిలర్ అభ్యర్థులు క్వార్టర్లు, (మద్యం) డబ్బులు ఎర చూపుతున్నారని ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ రచ్చ చేశారు.జిల్లా వ్యాప్తంగా ఈ ఎన్నికలు మందకొండగా జరిగాయని చెప్పవచ్చు. చాలామంది ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి పెద్దగా చూపలేదని తెలుస్తోంది. మంచిర్యాల జిల్లా కేంద్రంలో కార్పొరేషన్ లో 181778 ఓట్లు, లక్షెట్టిపేటలో 18331, క్యాతన్ పల్లి 29731, చెన్నూరు 19903, బెల్లంపల్లి మునిసిపాలిటీలలో 44554 ఓటర్లు ఉన్నారు. మంచిర్యాల జిల్లాలో కేవలం చెన్నూరు నియోజకవర్గంలో ఎన్నికలు ఉద్రిక్త వాతావరణం లో జరిగాయి. ఇక్కడ అధికారులు, పోలీస్ సిబ్బంది అధికార కాంగ్రెస్ పార్టీకి వత్తాసు పలుకుతున్నారని, భారత రాష్ట్ర సమితి క్యాడర్ను నాయకులను అడుగడుగునా సోదాలు నిర్వహిస్తున్నారని ఆరోపిస్తూ మాజీ చెన్నూరు ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ చెన్నూరు పట్టణంలోని బిఆర్ అంబేద్కర్ స్థూపం ముందర నిరసన వ్యక్తం చేశారు. అంతేకాకుండా క్యాతన్ పల్లి 13వ వార్డులో నక్క ఊర్మిలా అనే మహిళ తన ఓటును ఎవరు వేశారని అధికారులకు ఫిర్యాదు చేశారు. లక్షట్టి పేట మున్సిపాలిటీలో మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్ పోలింగ్ బూత్ లో ప్రచారం చేస్తున్నాడని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఐదు పోలింగ్ భూతులలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రామగుండం సిపి, మంచిర్యాల డిసిపి భాస్కర్ లు భారీ పోలీసు బందోబస్తులు నిర్వహించారు. ఈ ఎన్నికలలో చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేకానంద, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే, బాల్క సుమన్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు లు వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటర్ల సరళిని ఎప్పటికప్పుడు జిల్లా ఎన్నికల అధికారి కుమార్ దీపక్ ఇతర అధికారులతో పర్యవేక్షించారు.

### ఆదిలాబాద్లో ప్రశాంతంగా

## ముగిసిన పోలింగ్ ప్రక్రియ

**ఆదిలాబాద్ మహా:** మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల కార్పోరేషన్ తో పాటు 10 పురపాలికలకు జరిగిన పోలింగ్ చెదురు ముదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 976 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఆదిలాబాద్ బల్దియా కు సంబంధించి మొత్తం 49 వార్డులు 216 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు ఉదయం 7 గంటల నుండే ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టణంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ తో పాటు పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసారు. ఎలంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో పోలీసులు జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.ఇక ఎల్లుండి జరిగే కౌంటింగ్ పై ఫోకస్ పట్టింది. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో మొత్తం 49 వార్డులు 14 రూట్లు, 62 లోకేషన్స్ లో 216 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు బారులు తీరి ఓటు వేసారు. మొత్తం 1లక్షా 43వేల 635 మంది ఓటర్లకు గాను పోలింగ్ సమయం ముగిసే వరకు 99183మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. దీంతో 69.04శాతం పోలింగ్ నమోదైంది.

## బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలవాలని ప్రత్యేక పూజలు

### బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి పట్టణంలోని 34 వార్డులలో పోటీ చేస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు విజయాన్ని వరించాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పంచముఖహనుమాన్ ఆలయంలో బుధవారం నాడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బెల్లంపల్లి పట్టణంలో బెల్లంపల్లి బల్దియా పై గులాబీ జెండా ఎగురవేయాలని ఆంజనేయ స్వామిని మనసారా ఆకాంక్షించారు.



# ఎంత అందమైన అనుభూతి!

ఎంతటి దూర ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలవుతుంది. ఒక్క అడుగు పడిందంటే ఎంతో కొంత విజయం లభించినట్లే! అలా తన సినీ ప్రస్థానానికి పునాది వేసిన తొలి సినిమాను గుర్తు చేసుకున్నారు మెగాస్టార్ చిరంజీవి. 1979లో వచ్చిన పునాదిరాళ్లు సినిమాతో చిరంజీవి నటప్రస్థానం మొదలైంది. తొలి మెట్టుకే విజయాన్ని అందుకుని గుండె నిండా ధైర్యంతో ముందడుగు వేశారు. తనను తాను చెక్కుకుంటూ అంచెలంచెలుగా ఎదిగి పేరు ప్రఖ్యాతలు సంపాదించారు.

### చందమామ కథలాంటి అనుభూతి

తాజాగా ఆయన పునాదిరాళ్లు సెట్‌లో అడుగుపెట్టిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. "ఈరోజు "పునాదిరాళ్లు" సినిమా కోసం జీవితంలో కెమెరా ముందు నిలిచిన తొలి రోజు. ఆ రోజు నాలో కలిగిన ఆతృత, ఆనందం, బాధ్యత, భావోద్వేగం మాటల్లో వర్ణించలేను. ఆ క్షణం ఇప్పటికీ నిన్న, మొన్న జరిగిందేమో అన్నట్టు అనిపిస్తుంది. ఒక అందమైన చందమామ కథ లాంటి అనుభూతి.

### నట జీవితానికి పునాది రాళ్లు

ఈ ప్రత్యేక సందర్భంలో, నాకు ఆ తొలి అవకాశం ఇచ్చిన ఆ చిత్ర దర్శక, నిర్మాతలకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. వారి నమ్మకం, ప్రోత్సాహంతో వచ్చిన అవకాశంతో నటనలో నా ప్రయాణానికి పునాది రాళ్లు పడ్డాయి. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ నన్ను ఆదరిస్తూ, ఆశీర్వదిస్తున్న ప్రేక్షకులందరికీ నా కృతజ్ఞతలు" అని ట్వీట్ చేశారు. తన ఫస్ట్ మూవీ చిత్రీకరణ సమయంలో దిగిన ఫోటోలను ఈ పోస్ట్‌కు జత చేశారు.



# టాలీవుడ్‌లో వివిఎఫ్ఎక్స్ సినిమాలకు కష్టకాలం?

టాలీవుడ్‌లో విఎఫ్ఎక్స్ ఆధారిత సినిమాలు వరుసగా రెడీ అవుతున్నాయి. కానీ ప్రస్తుతం మార్కెట్ పరిస్థితులు నిర్మాతలకు తలనొప్పిగా మారాయి. ఒకవైపు ఓటిటి సంస్థలు ఇలాంటి సినిమాలను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ, ఫైనల్ కాపీ చూపించకపోతే ఒప్పందాలు కుదిరే పరిస్థితి లేదు. గతంలో వచ్చిన పలు విఎఫ్ఎక్స్ చిత్రాలు నాసిరకమైన గ్రాఫిక్స్ కారణంగా ప్రేక్షకుల నిరాకరణకు గురైన విషయం తెలిసిందే. ఆ అనుభవం వల్లే ఇప్పుడు ఓటిటి సంస్థలు చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాయి. సినిమా ఫైనల్ వెర్షన్ చూపిస్తేనే రేటు నిర్ణయిస్తామని ఓటిటిలు స్పష్టంగా చెబుతున్నాయి. మెగాస్టార్ చిరంజీవి నటించిన విశ్వంభర, నిఖిల్ స్వయంభు, నాగ్ చైతన్య వృషకర్మ వంటి భారీ విఎఫ్ఎక్స్ ప్రాజెక్టులు ఓటిటి డీల్స్ కోసం వెయిటింగ్‌లో ఉన్నాయి. అయితే ఇప్పటికే పూర్తయిన సినిమాలు మాత్రం సులభంగానే అమ్ముడవుతున్నాయి. కానీ ఇంకా మేకింగ్ దశలో ఉన్నవాటికి ఫైనల్ కాపీ చూపించకపోతే ఒప్పందాలు ముందుకు సాగట్లేదు. ఇలాంటి వాటిలో పాన్ ఇండియా స్థాయిలో క్రేజీ కాంబినేషన్లు కూడా ఉన్నాయి. కానీ నిర్మాతలు మాత్రం కొత్తగా విఎఫ్ఎక్స్ సినిమాలు ప్లాన్ చేయడంలో ముందుకు వెనుకకు ఆలోచిస్తున్నారు. ఓటిటి మార్కెట్ బలహీనంగా ఉండటం వల్ల రిస్క్ ఎక్కువగా కనిపిస్తోంది.

# మమితా బైజు కొత్త సినిమా..




నటి మమితా బైజు క్రేజ్ ఇప్పుడు మామూలుగా లేదు. పదహారేళ్ల ప్రాయంలోనే నటిగా చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ మలయాళీ ముద్దుగుమ్మ గత ఎనిమిదేళ్లగా మలయాళం, తమిళ భాషల్లో వరుస అవకాశాలను అందుకుంటూ సక్సెస్ రేట్‌ను పెంచుకుంటూ పోతున్నారు. తాజాగా సూర్యకు జంటగా నటిస్తున్న చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. తను నటించిన మలయాళం చిత్రం ప్రేమలు మాలీవుడ్‌లోనే కాకుండా కోలీవుడ్, టాలీవుడ్ ల్లోనూ అనువాదమై మంచి విజయాన్ని అందుకుంది. ఆ తరువాత రెబల్ చిత్రంతో జీవీ.ప్రకాష్ కుమార్‌కు జంటగా కోలీవుడ్‌కు పరిచయమైన బ్యూటీ ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించకపోయినా, ప్రదీప్ రంగనాథన్‌కు జంటగా నటించిన డ్యూడ్ చిత్రం తమిళం, తెలుగు భాషల్లో మంచి విజయాన్ని అందుకుంది.

తాజాగా విజయ్ కథానాయకుడుగా నటించిన జననాయకన్ చిత్రంలోనూ మమితా బైజు కీ రోల్ చేశారు. కాగా ప్రస్తుతం ధనుష్ సరసన నటిస్తున్న కారా చిత్రాన్ని కూడా పూర్తి చేశారు. అదేవిధంగా బెత్లెహేమ్ కుడుంబ అనే మలయాళం చిత్రంలోని నటిస్తూ బిజీగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దర్శక, నటుడు ప్రదీప్ రంగనాథన్ తాజా చిత్రంలో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తాజా సమాచారం. అయితే ఈ చిత్రంలో ఆయనకు జంటగా కాకుండా ఆయన నిర్మించనున్న చిత్రంలో మమితా బైజు నాయకిగా నటించడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. చాలామంది నటుల మాదిరిగానే ప్రదీప్ రంగనాథన్ కూడా నిర్మాతగా మారిపోతున్నారు. ఈ చిత్రానికి ఆయన అసోసియేట్ డైరెక్టర్ ను దర్శకుడిగా పరిచయం చేయబోతున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన పూర్తి వివరాలుతో త్వరలో వెలువడే అవకాశం ఉంది.



# కమిట్‌మెంట్ కోసం ఫోన్లు వస్తూనే ఉంటాయి



క్యాస్టింగ్ కౌచ్‌పై నటి ఎస్తర్ నోరోన్హా కీలక వ్యాఖ్యలు చేసింది. టాలీవుడ్‌లో క్యాస్టింగ్ కౌచ్ అనేది ఇప్పటికీ కొనసాగుతుందని, కమిట్‌మెంట్ ఇస్తేనే చాన్స్‌లు ఇస్తామని చెప్పే దర్శకనిర్మాతలు చాలా మంది ఉన్నారని ఆరోపించింది. ఆడియన్స్ మాత్రమే క్యాస్టింగ్ కౌచ్‌ని కంట్రోల్ చేయగలరని ఎస్తర్ చెబుతోంది. ఆమె కీలకపాత్ర పోషించిన చిత్రం అమరావతికి ఆహ్వానం చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ఓ యూట్యూబ్ చానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో క్యాస్టింగ్ కౌచ్‌పై మాట్లాడింది. క్యాస్టింగ్ కౌచ్ అనేది ఇప్పటికే టాలీవుడ్‌లో కొనసాగుతూనే ఉంది. రెండ్రోజుల క్రితమే నాకు ఓ కాల్ వచ్చింది. కమిట్‌మెంట్‌కి ఓకేనా అడిగారు. నో చెప్పడంతో వదిలేశారు. చాలామంది హీరోయిన్లు ఇంటర్వ్యూలలో నేను కష్టపడి వచ్చాను.. టాలెంట్‌తోనే పైకి వచ్చాను, ఒక్కరు కూడా నన్ను కమిట్‌మెంట్ అడగలేదని చెబుతారు. కానీ అదంతా అబద్ధం. చాలా మంది కాంప్రమైజ్ అయినవాళ్లే. నటన రానివాళ్లు కూడా పెద్ద పెద్ద ప్రాజెక్టుల్లో ఎలా ఉంటారు? వాళ్లకు ఉన్న లోపాన్ని కప్పిపుచ్చాలంటే కమిట్‌మెంట్ ఇవ్వాల్సిందే. అయితే ఎవరు అడిగారు అనేది ముందే చెప్పరు. ముందుగా మీడియేటర్ ద్వారా కమింట్‌మెంట్ గురించి అడిగిస్తారు. ఓకే అంటే రెమ్యునరేషన్ ఇలా, లేదంటే అలా చెబుతారు. మనసైడ్ నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే.. అడిగింది ఎవరనే పేరుని చెబుతారు. అందుకే ముందుగానే కమిట్‌మెంట్ అడిగింది ఎవరు అని కనిపెట్టలేం. సినిమాలలో ఎప్పుడు చీరలో కనిపించి.. బయటికి దేవతలా కనిపించేవాళ్లు కూడా అలాంటి పనులు చేస్తారు. అయితే నేను ఏ కేటగిరీలో ఉన్నాను అనేది వారికి క్లారిటీ రావడం లేదు. కొంతమంది ఇంటర్వ్యూలో ఇలా మాట్లాడి.. తర్వాత అలాంటి పనులు చేస్తుంటారు. నేను కూడా అదే క్యాటగిరీ అనుకొని కాల్ చేస్తుంటారు. ఆడియన్స్ కూడా 'ఈవిడ బాగానే మాట్లాడుతుంది, కానీ ఏదో ఒకటి చేసే ఉంటుందని' అనుకుంటారు. అలాంటి వాళ్లు నా ఫిల్మోగ్రఫీ చూడాలి. ఒకవేళ నేను కూడా కమిట్‌మెంట్‌కి ఓకే చెబితే.. ఇన్నేళ్లలో ఒక్క పెద్ద ప్రాజెక్టు కూడా నా దగ్గరకు రాదా? నన్ను జనం ఇంతలా ప్రేమిస్తున్నారు.. నేను చేసిన ప్రతి ప్రాజెక్ట్‌ను ఆదరిస్తున్నారు. ఆడియన్స్, మీడియా సపోర్ట్ నాకుంది. అలాంటప్పుడు ఎందుకు నాకు అవకాశం రాలేదో ఆలోచించాలి. ఇండస్ట్రీలోకి కొత్తగా వస్తున్న యువతరం.. కమిట్‌మెంట్ గురించి అడగడం లేదు. వాళ్ల చాలా ఫ్యాషన్‌తో పని చేస్తున్నారు. అలాంటి పనులు చేసేవాళ్లంతా పాత బ్యాచ్. వారందరిని నేను అంకుల్స్ బ్యాచ్ అని పిలుచుకుంటాను. వాళ్ల ప్రయత్నాలు జరుగుతూనే ఉంటాయి. మనలోని లోపాలను ఆసరాగా చేసుకొని కమిట్‌మెంట్ గురించి అడుగుతారు. ఇండస్ట్రీలో క్యాస్టింగ్ కౌచ్ అనేది కనిపించకుండే చేసే అవకాశం ఆడియన్స్‌కి మాత్రమే ఉంది. వాళ్లు ఫిక్స్ అయితే.. ఇక్కడ అలాంటి పనులు జరుగవు. హాలీవుడ్, బాలీవుడ్‌లో లాగా.. ఇక్కడ కూడా కాంప్రమైజ్ అయి నటించే నటీనటులను బ్యాన్ చేయాలి. అలాంటి వాళ్లు ఎంత పెద్ద సినిమా చేసినా బాయికాట్ చేయాలి. అప్పుడే క్యాస్టింగ్ కౌచ్ ఆగిపోతుంది' అని ఎస్తర్ చెప్పుకొచ్చింది.

### యశ్ టాక్సిక్.. రిలీజ్‌కు ముందే రికార్డ్స్..

# మరో బిగ్ డీల్..!



శాండల్‌వుడ్ హీరో యశ్ నటిస్తోన్న మోస్ట్ అవేటేడ్ యాక్షన్ థ్రిల్లర్ టాక్సిక్. కేజీఎఫ్2 తర్వాత రాకింగ్ స్టార్ ఈ మూవీతోనే ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఇటీవల టీజర్ రిలీజ్ చేయగా పెద్దఎత్తున విమర్శలొచ్చాయి. ముఖ్యంగా బోల్డ్ సీన్ పెట్టడంపై దర్శకురాలిపై విమర్శలు చేశారు. ఈ చిత్రానికి గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం మార్చి 19న థియేటర్లలో సందడి చేయనుంది. ఇప్పటికే ఈ మూవీ తెలుగు రాష్ట్రాల హక్కులను దిల్ రాజుకు చెందిన శ్రీ వెంకటేశ్వర డిస్ట్రిబ్యూటర్స్ దక్కించుకుంది. దాదాపు రూ.120 కోట్ల డీల్ చేసుకున్నట్లు తెలుస్తోంది. అయితే తాజాగా ఈ మూవీకి మరో బిగ్ డీల్ కుదిరినట్లు తెలుస్తోంది. ఓవర్‌సీస్‌లో ఇండియన్ లాంగ్వేజేస్‌కి దాదాపు రూ.105 కోట్లకు బిజినెస్ ఓకే అయినట్లు సమాచారం. ప్రముఖ విదేశీ పంపిణీదారు అయిన ఫార్స్ ఫిల్మ్‌స్‌తో ఈ డీల్ చేసుకుంది. దీంతో ఒక ఇండియన్ సినిమాకు అత్యధిక డీల్ సాధించిన చిత్రంగా టాక్సిక్ నిలవనుంది. రూ. 105 కోట్ల విదేశీ డీల్ రావడం భారతీయ సినిమాకు దక్కిన ఘనతగా భావిస్తున్నారు.

ఈ ప్రీ రిలీజ్ బిజినెస్ డీల్‌తో ఓవర్‌సీస్‌లో ఇండియన్ భాషల్లో ఫార్స్ ఫిల్మ్ ఈ చిత్రాన్ని విడుదల చేయనుంది. ఈ బిగ్ డీల్ భారతీయ చిత్రానికి ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద అంతర్జాతీయ విడుదల అవుతుందని భావిస్తున్నారు. ఈ చిత్రం నేపాల్, జపాన్, చైనా మినహా దాదాపు అన్ని ప్రపంచ దేశాల్లో విడుదల కానుంది. కాగా.. ఈ చిత్రాన్ని ఒకేసారి కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో చిత్రీకరించారు. ఈ సినిమా మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా రిలీజవుతోంది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034